నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, సోమవారం 5 ఆగస్టు 2024 | NALGONDA

## పిన్ నంబర్ మార్చుతామని రూ.88వేలు కొట్టేశారు

- క్రెడిట్ కార్డుదారుడికి ఫోన్ చేసిన కేటుగాళ్లు

మోత్కూరు, ఆగస్టు 4: ఎస్‌బీఐ ఖాతాదారుని క్రెడిట్ కార్డు ద్వారా కేటుగాళ్లు రూ.88 వేలు కాజేశారు. ఈ ఘటన అలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. పట్టణానికి చెందిన ఓ వ్యాపారి మోత్కూరులోని ఎస్‌బీఐలో క్రెడిట్ కార్డు పొంది ఉన్నాడు. గత నెలలో పలుమార్లు ఖాతాదారునికి క్రెడిట్ కార్డులో పిన్ నంబర్‌ను సరి చేయడం కోసం కేటుగాళ్లు ఫోన్ చేశారు. గత నెల15న తన ఖాతా నుంచి ఒకసారి రూ.40 వేలు, మరోసారి రూ.48వేలను కాజేశాడు. విషయం తెలుసుకున్న బాధితుడు ఎస్‌బీఐకి వెళ్లి తన ఖాతా వివరాలను తెలుసుకునే ప్రయత్నం చేశాడు. బ్యాంకులో క్రెడిట్ కార్డులను పర్యవేక్షించే ఉద్యోగి సెలవులో ఉన్నట్లు తెలిపారు. శనివారం బ్యాంకు ఉద్యోగి పరిశీలించడంతో ముంబై బ్యాంకు నుంచి రూ.88 వేలు కొట్టేసినట్లు చెప్పారు. బ్యాంకు అధికారులు సూచనతో బాధితుడు సైబర్ క్రైమ్, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.



మహిళలకు ఇచ్చే కుట్టుమిషన్లను ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

# నిండుకుండలా సాగర్

## నేడు క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

- శ్రీశైలం నుంచి 3,21,873 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- నీళ్లు ఉన్నా పూర్తిస్థాయిలో జరుగని జల విద్యుత్ ఉత్పత్తి
- పనిచేయని జల విద్యుత్ రెండో టర్బైన్




నిండుకుండలా నాగార్జునసాగర్ రిజర్వాయర్

నందికొండ, ఆగస్టు 4 : నాగార్జున సాగర్ రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో భారీగా పెరుగడంతో నిండుకుండలా మారింది. జూలై 25 నుంచి నాగార్జునసాగర్‌కు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి ఇన్‌ఫ్లో ప్రారంభం కాగా 503 అడుగుల నుంచి క్రమంగా నీటి మట్టం పెరుగుతూ వచ్చింది. 15 రోజుల్లోనే 574.90 (268.86టీఎంసీలు) అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 590 అడుగులకుగానూ ఇంకా 15 (44 టీఎంసీలు) అడుగులు మాత్రమే నిండాల్సి ఉన్నది. ప్రస్తుతం శ్రీశైలం డ్యామ్ 10 క్రస్ట్ గేట్లు, జల విద్యుత్ కేంద్రాల ద్వారా 3,21,873 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో సాగర్‌కు వచ్చి చేరుతున్నది. రోజుకు 27 టీఎంసీల చొప్పున వస్తుండడంతో మరో రెండు రోజుల్లో ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండనుంది. రిజర్వాయర్ నీటి మట్టం 580 అడుగులకు చేరగానే డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తారు. డ్యామ్ క్రస్ట్ గేట్లను సోమవారం ఎత్తి దిగువకు నీటిని విడుదల చేయడానికి ఎన్నెస్పీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రిజర్వాయర్‌కు మొత్తం 3,21,873 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 37,873 క్యూసెక్కుల అవుట్ ఫ్లో కొనసాగుతున్నది. ప్రస్తుతం కుడి కాల్వ ద్వారా 5,700, ఎడమ కాల్వ ద్వారా 4,613 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,200, వరద కాల్వ ద్వారా 320 క్యూసెక్కుల నీటి విడుదల కొనసాగుతున్నది. ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా నీటి విడుదల లేదు.

### క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల ఇలా..

| సంవత్సరం | అడుగులు | నీటి విడుదల |
|---|---|---|
| 2014 | 590 | సెప్టెంబర్ 15న |
| 2015 | 540 | నీటి విడుదల లేదు |
| 2016 | 540 | నీటి విడుదల లేదు |
| 2017 | 577 | నీటి విడుదల లేదు |
| 2018 | 590 | సెప్టెంబర్ 2న |
| 2019 | 590 | ఆగస్టు 12న |
| 2020 | 586 | ఆగస్టు 25న |
| 2021 | 585 | ఆగస్టు 1న |
| 2022 | 587 | ఆగస్టు 11న |
| 2023 | 535 | నీటి విడుదల లేదు |
| 2024 | 585 | ఆగస్టు 4న |



మరమ్మతుల్లో ఉన్న జల విద్యుత్ కేంద్రం రెండో టర్బైన్

### లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలి : ఎన్నెస్పీ సీఈ నాగేశ్వర్‌రావు

నాగార్జునసాగర్ డ్యామ్ క్రస్ట్ గేట్ల ద్వారా సోమవారం ఉదయం 8 గంటలకు 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న టెయిల్ పాండ్‌కు విడుదల చేస్తున్నాం. లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలి. నదిలో చేపల వేటకు మత్స్యకారులు వెళ్లరాదు. వరద ప్రవాహానికి వలలు కొట్టుకుపోతాయి. నదిలో వేసిన పైపులు, మోటర్లను రైతులు తీసివేయాలి. లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేయాల్సిందిగా ఎన్నెస్పీ అధికారులకు సూచించాం.

### పనిచేయని జల విద్యుత్ కేంద్రం రెండో టర్బైన్

నాగార్జునసాగర్ డ్యామ్‌కు ఈ ఏడాది భారీగా వరద నీరు వచ్చి గేట్లు ఎత్తనున్నారు. దిగువకు నీరు వృథాగా పోనున్నది. కానీ ఒక టర్బైన్ మరమ్మతుల కారణంగా డ్యామ్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా పూర్తి స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి చేసే పరిస్థితి లేకుండా పోయింది. గతేడాది నుంచి సమయం చాలా ఉన్నా జెన్‌కో అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. డ్యామ్ ప్రధాన జల విద్యుత్ కేంద్రంలో మొత్తం 8 టర్బైన్‌లు ఉండగా ఏడు పనిచేస్తున్నాయి. రెండో టర్బైన్ మరమ్మతు పనులు ఇంకా పూర్తి కాలేదు. ప్రతియేటా లక్షల రూపాయలు వెచ్చించి మరమ్మతుల పేరుతో ఖర్చు చేస్తున్న జెన్‌కో అధికారులు సకాలంలో పనులను పూర్తి చేయలేక పోతున్నారు. జల విద్యుత్ కేంద్రం ద్వారా మొత్తం 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగల సామర్థ్యం ఉండగా ఇప్పుడు 2 టర్బైన్ పని చేయకపోవడంతో 700 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేపడుతున్నారు. అధికారులు కాంట్రాక్టుల కమీషన్ల కోసమే పనులు జ్యాపం చేస్తున్నారని సిబ్బంది అనుకుంటున్నారు. దీనిపై జెన్‌కో ఎస్ఈని వివరణ కోరగా టర్బైన్ మరమ్మతులకు జపాన్ నుంచి నిపుణులు రావాల్సి ఉన్నదని, వారు రాకపోవడంతో రెండో టర్బైన్ మరమ్మతుల పనుల్లో ఆలస్యమైందని తెలిపారు.

### సాగర్ దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

నల్లగొండ : నాగార్జున సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి సోమవారం నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో దిగువన ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలెవరూ నదిలోకి వెళ్లొద్దని, స్నానాలు చేయొద్దని, ఈత కొట్టొద్దని పేర్కొన్నారు. పశువులు, మేకలు, గొర్రెలను నదిలోకి తీసుకెళ్లొద్దని తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు నుంచి వచ్చే వరదను బట్టి నీటి విడుదల ఉంటుందని, ఆస్తి, ప్రాణ నష్టం జరుగకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

## యువతకు ఉపాధి కల్పించడానికే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 4 : నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడానికి నల్లగొండలో నైపుణ్యాభివృద్ధి సంస్థను నిర్మిస్తున్నట్లు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయం సమీపంలో ఉన్న పార్కులో ఆదివారం ఆయన న్యాక్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన 30 మంది మహిళలకు ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా కుట్టు మిషన్లు అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థలో యువతకు పలు రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నామని, ప్రధానంగా మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ఇచ్చి స్వయంగా ఉపాధి పొందే విధంగా చర్యలు తీసుకోనున్నామని తెలిపారు. చదువుకున్న యువ త ఏదో ఒక రంగంలో శిక్షణ తీసుకొని ఉపాధి మార్గాలను సంపాదించుకోవాలని చెప్పారు. అంతకు ముందు తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల నుంచి పలు సమస్యలకు సంబంధించిన వినతులు స్వీకరించి పరిష్కార మార్గాలు చూపించారు. అదే సమయంలో నల్లగొండ మండలం దుప్పలపల్లికి చెందిన స్వాతి గుండెజబ్బుతో బాధపడుతున్నానని, తనకు సాయం చేసి ఆపరేషన్ చేయించాలని మంత్రిని కోరగా ఆయన ఆస్పత్రి ఖర్చులు అన్నీ భరిస్తానని హామీ ఇచ్చారు. అలాగే తన తల్లిదండ్రులు చనిపోవడంతో పదో తరగతి చదువడం ఇబ్బందిగా ఉందని మంత్రికి విన్నవించగా తాను చదివిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో న్యాక్ నల్లగొండ ఇన్‌చార్జి అశోక్, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రవి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



మాడ్గులపల్లి మండలం తోపుచర్ల గ్రామ సమీపంలో కంపచెట్లతో ఉన్న వరద కాల్వ

## కాల్వలు ఇలా.. నీళ్లు వచ్చేదెలా?

### అధ్వానంగా వరద కాల్వ

- కంపచెట్లతో పూడిన కాల్వలు
- మరమ్మతులను పట్టించుకోని ప్రభుత్వం
- 80 చెరువులు నిండేదెలా?

మిర్యాలగూడ, ఆగస్టు 4 : ఎలిమినేటి మాధవ రెడ్డి ప్రాజెక్టు పరిధి నుంచి వివిధ మండలాలకు సాగు నీరు అందించేందుకు వరద కాల్వను నిర్మించారు. ఈ కాల్వ ద్వారా పెద్దవూర, అనుముల, నిడమనూరు, త్రిపురారం, తిప్పర్తి, మాడుగులపల్లి, వేములపల్లి మండలాల్లోని సుమారు 80 చెరువులను నింపడంతోపాటు 80వేల ఎకరాలకు సాగు నీరు అందుతుంది. కోట్లాది రూపాయలు వెచ్చించి చేపట్టిన ఈ వరద కాల్వ ప్రస్తుతం అధ్వానంగా మారింది. కంపచెట్లు పెరిగి పూడిపోయింది. మరమ్మతులకు నిధులు కేటాయించకపోవడంతో నీళ్లు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ఈ వరద కాల్వ కింద 81వ ప్యాకేజీలో 27 డిస్ట్రిబ్యూటరీలు, 110వ ప్యాకేజీలో 15 డిస్ట్రిబ్యూటరీలతోపాటు తూములు ఉన్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 570 అడుగులు నీటి మట్టం దాటగానే ఈ వరద కాల్వకు నిరంతరాయంగా నీళ్లు వెళ్లే విధంగా నిర్మాణం చేశారు.

#### గతేడాది గడ్డుకాలం

కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో అధికంగా వర్షాలు కురుస్తుండడంతో పై నుంచి వస్తున్న వరదతో సాగర్ డ్యామ్ నిండు కుండలా మారింది. ఆదివారం 571 అడుగులు నీటి మట్టం దాటింది. దీంతో ఆయకట్టు పరిధిలోని చెరువులు నింపేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి సాగర్ నీటిని ముందుగా చెరువులు నింపేందుకు వినియోగిస్తామని ప్రకటించారు. కానీ వరద కాల్వ పూడిపోయి అధ్వానంగా ఉండడంతో నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. దాంతో పలు గ్రామాలు రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గతేడాది కరువు కారణంగా 80 చెరువులు నీళ్లు లేక ఎండిపోయాయి. భూగర్భ జలాలు అడుగంటి పంటలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ప్రభుత్వం ముందస్తుగా కాల్వకు మరమ్మతులు చేయించి చెరువులు నింపాలని రైతులు జిల్లా మంత్రులు, ఉన్నతాధికారులను వేడుకొంటున్నారు.

#### కంపచెట్లు తొలగించి చెరువులు నింపాలి



గత తొమ్మిదేండ్లుగా వరదకాల్వ ద్వారా మా చెరువులు నిండినయి. గతేడాది కరువు కారణంగా నీళ్లు రాలేదు. ఈ ఏడు సాగర్ ప్రాజెక్టు తొందరగా నిండింది. కానీ కాల్వల పరిస్థితి అధ్వానంగా ఉన్నది. కాల్వలు పూడిపోయి, కంపచెట్లు మొలిచి నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. వెంటనే మర్మతులు చేయించి చెరువులకు, పంటలకు నీళ్లు అందించాలి.

–కొత్తగుళ్ల సైదులు, తోపుచర్ల, మాడ్గులపల్లి

## రాజకీయ కక్షతోనే బీఆర్ఎస్ ఆఫీసును కూల్చే కుట్ర

- అనుమతికి దరఖాస్తు చేసుకుంటే మంత్రి ఇవ్వనివ్వడం లేదు
- కోమటిరెడ్డి బెదిరింపులకు భయపడేది లేదు
- మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి



నల్లగొండ, ఆగస్టు 4 : రాజకీయ కక్ష, ఈర్ష్యాద్వేశాలతోనే జిల్లా కేంద్రంలో నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ ఆఫీసును కూల్చాలని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కుట్ర పన్నారని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ ఆఫీసును కూల్చేయాలని మంత్రి అధికారులను ఆదేశించిన దానిపై ఒక ప్రకటనలో కంచర్ల ఘాటుగా స్పందించారు. నల్లగొండలో గత ప్రభుత్వం కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగానే భూమి కొనుగోలు చేసి నిర్మించినట్లు తెలిపారు. పార్టీ ఆఫీసు నిర్మాణానికి గత కమిషనర్ దేవ్‌సింగ్‌కు దరఖాస్తు చేసుకుంటే అసలు ఏ పార్టీ ఆఫీసుకు అనుమతి లేదని చెప్పడంతో వెనక్కి తగ్గినట్లు తెలిపారు. అయితే కోమటిరెడ్డి అనుమతి పేరుతో అధికారులను ఒత్తిడి చేస్తుంటే, ప్రస్తుతం తీసుకోవాలని దరఖాస్తు చేసుకుంటే అధికారులను భయపెట్టి అనుమతులు ఇవ్వకుండా చేస్తున్నారని చెప్పారు. అనుమతి తీసుకుంటామని, నిబంధనల ప్రకారం 33 శాతం ఫైన్ కూడా కడుతామని అంటే ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. అసలు రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీ ఆఫీసుల్లో దేనికి కూడా అనుమతి లేదని, కొన్ని ఆఫీసులకు అసలు పేపర్లే లేవని తెలిపారు. హైదరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం అయిన గాంధీభవన్‌కే అనుమతి లేదని, పార్టీ కార్యాలయాలు ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలకు దేవాలయాల లాంటివని పేర్కొన్నారు. గతంలో తాను ఎమ్మెల్యేగా తెచ్చిన నిధులకు సంబంధించిన పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తూ మంత్రి కోమటిరెడ్డి కాలం గడుపుతున్నారని అభివృద్ధిని పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఆయన బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని, పార్టీ ఆఫీసు జోలికి వస్తే చర్యలు వేరేలా ఉంటాయని హెచ్చరించారు.





టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

## నేటి నుంచి స్వచ్ఛదనం.. పచ్చదనం

- 9వ తేదీ వరకు పకడ్బందీగా కార్యక్రమం నిర్వహించాలి
- కలెక్టర్ సి.నారాయణరెడ్డి

నల్లగొండ, ఆగస్టు 4 : నేటి నుంచి ఈ నెల 9 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాల్లో స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులతో ఆయన ఆదివారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం.. పచ్చదనం కార్యక్రమం చేపట్టిందని, అందులో భాగంగా పరిశుభ్రత, మొక్కలు నాటడం, తాగునీరు, వీధి కుక్కల బెడద తగ్గింపు వంటి అంశాలపై దృష్టి సారించి పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. వెయ్యి మంది జనాభా ఉన్న ప్రతి ప్రాంతంలో ఒక కమ్యూనిటీ సోక్ పిట్ నిర్మించాలని తెలిపారు. పల్లెల్లో ట్రాక్టర్లు, బుల్డోజర్లు వినియోగించి శ్రమదానం చేపట్టాలని చెప్పారు. పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని, ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా చూడాలని, పాఠశాలలు, అంగన్వాడీల్లో విద్యార్థులు అనారోగ్యం బారిన పడకుండ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యులను చేయాలని అన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు పూర్ణ చంద్ర, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌ల పేరిట సొంతానికి డీజిల్..?

- పేషెంట్లను దూర ప్రాంతాలకు తరలించినట్లు బిల్లుల సృష్టి
- సూర్యాపేట జనరల్ దవాఖానలో ఇదో విచిత్రం
- అవినీతి సొమ్ములో కమీషన్ కోసం ఓ డ్రైవర్ రచ్చ!



సూర్యాపేట, ఆగస్టు 4 (నమస్తే తెలంగాణ) : సూర్యాపేట జనరల్ ఆసుపత్రిలో అంబులెన్స్‌ల పేరిట డీజిల్‌ను సొంత అవసరాలకు వాడుకుంటున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమర్జెన్సీ పేరుతో పేషెంట్లను దూర ప్రాంతాలకు తరలించినట్లు బిల్లులు సృష్టించి నెలనెలా వేలాది రూపాయలు స్వాహా చేస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఓ డ్రైవర్‌కు విషయం తెలిసి అవినీతి సొమ్ములో వాటా కావాలని డిమాండ్ చేస్తూ రచ్చచేయడంతో న్యూసెన్స్ అవుతుందని ఆందోళన చెందిన అక్రమార్కులు వెంటనే సదరు డ్రైవర్‌తో చర్చలు చేసి నోరు మూయించినట్లు ఆసుపత్రి వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో సూర్యాపేటలో ఏరియా ఆసుపత్రిగా ఉండగా మెడికల్ కళాశాల వచ్చిన తర్వాత జనరల్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ అయ్యింది. తదనుగుణంగా గత నాలుగైదేండ్లుగా అత్యున్నత ప్రమాణాలతో రోగులకు కార్పొరేట్ వైద్యం అందించారు. కానీ కొద్ది నెలలుగా ఈ ఆసుపత్రి తిరోగమనంలోకి పయనిస్తున్నది. ఓపీ నుంచి మొదలు ప్రసవాలు, అన్ని రకాల ఆపరేషన్లు తగ్గిపోతున్నాయి. దీనికి కారణం ఆసుపత్రిపై పర్యవేక్షణ లేకపోవడమేనని తెలుస్తున్నది. ప్రస్తుతం జనరల్ ఆసుపత్రికి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఉండగా ఇదే ఆసుపత్రిలో పనిచేసే మరో డాక్టర్ అనధికారికంగా అధికారాన్ని చలాయిస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని సమాచారం. అతనే అంబులెన్స్ పేరుతో తన సొంత వాహనంలో వారానికి రెండు సార్లు డీజిల్ పోయించుకుంటున్నాడని పేరు బహిర్గతం చేయడానికి నిరాకరించిన మరో డాక్టర్ చెబుతున్నాడు. నోరున్నోడిదో రాజ్యం అన్న చందంగా అతడి వ్యవహారం ఉందంట. ఒక్క డీజిల్ విషయంలోనే కాకుండా ఆసుపత్రిలోని అన్నింటా వేలు పెట్టి మందుల కొనుగోళ్లలో సైతం కమీషన్లకు తెరలేపాడని తెలుస్తున్నది. హైదరాబాద్ హెడ్ ఆఫీసులో తను ఎంత చెబితే అంతే అని, తనకు ఎవరు అడ్డు తగిలినా బదిలీ తప్పదని హెచ్చరిస్తున్నట్లు ఆసుపత్రిలో గుసగుసలు వినిపిస్తున్నాయి. పేద, మధ్య తరగతి వర్గాలకు ఖరీదైన వైద్యం అందుతున్న ఈ ఆసుపత్రి రోజురోజుకు అవినీతి, అక్రమాలకు నిలయంగా మారుతున్నది. తక్షణమే ఉన్నతాధికారులు కలుగజేసుకొని అడ్డుకోకపోతే ఆసుపత్రి క్రెడిబిలిటీ మరింత దిగజారడం ఖాయం. అలాగే ఆసుపత్రిలో గతం కంటే ఓపీ తగ్గుతుండడం, అన్ని రకాల మందులు అందుబాటులో ఉండకపోవడంతోపాటు ఇతర చికిత్సలు అందడం లేదని వస్తున్న ఆరోపణలపై స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంది.



చెర్వుగట్టుపై భక్తులు


## భక్తులతో కిక్కిరిసిన చెర్వుగట్టు

నార్కట్‌పల్లి, ఆగస్టు 4 : మండల పరిధిలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఆదివారం అమావాస్య కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొన్నారు.

అమావాస్య సందర్భంగా పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ఆలయ ప్రధాన అర్చకుడు పోతులపాటి రామలింగేశ్వర శర్మ ఆధ్వర్యంలో లక్ష పుష్పార్చన ఘనంగా నిర్వహించారు.

## అధ్వానంగా ఏఎమ్మార్పీ కాల్వ

### ఉదయ సముద్రం నుంచి అయిటిపాముల వరకు ఇదే పరిస్థితి



కట్టంగూర్ మండలం మల్లారంలో కంపచెట్లతో అల్లుకుపోయిన డి–41 ప్రధాన కాల్వ

కట్టంగూర్ : వ్యవసాయనికి సాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు ప్రధాన కాల్వ మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా మారింది. పూడికతీత, లైనింగ్, కంపచెట్ల తొలగింపు పనులు చేపట్టకపోవడంతో సకాలంలో రైతులకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. పానగల్లు ఉదయ సముద్రం నుంచి కట్టంగూర్ మండల పరిధిలోని బొల్లెపల్లి మీదుగా అయిటిపాముల రిజర్వాయర్ వరకు వచ్చే కాల్వకు ఇరువైపులా కంపచెట్లు అల్లుకోవడంతోపాటు అడుగు భాగం కొంత మేర పూడిపోయింది. నకిరేకల్ సబ్ డివిజన్ పరిధిలో డి–41 నుంచి డి–49 వరకు డిస్ట్రిబ్యూటరీ ద్వారా ఉదయ సముద్రం నుంచి నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి మండలాల్లోని సుమారు 30ఎకరాలకు సాగునీరు నీరందించాల్సి ఉంది. ప్రధాన కాల్వల నుంచి ఆయా ప్రాంతంలో ఉన్న చెరువులు, కుంటలకు వెళ్లే సబ్ డిస్ట్రిబ్యూటర్లు అధ్వానంగా మారడంతో రైతులకు ప్రయోజనం లేకుండా పోయింది. ప్రధాన ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలకు ముందే కాల్వ మరమ్మతు పనులు చేపట్టి దిగువకు సాఫీగా నీరు చేరేలా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై నీటిపారుదల శాఖ ఏఈఈ పాండు నాయక్‌ను సంప్రదించగా నకిరేకల్ సబ్ డివిజన్ పరిధిలోని కాల్వ మరమ్మతులు, కంపచెట్ల తొలగింపు, షట్టర్ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించామని, ప్రభుత్వం నుంచి నిధులు కాగానే పనులు చేపడుతామని తెలిపారు.

#### కాల్వకు మరమ్మతులు చేపట్టాలి



కంపచెట్లు మొలిచి కాల్వ పూడిపోవడంతో సాగునీరు సకాలంలో అందడంలేదు. బొల్లెపల్లి నుంచి అయిటిపాముల రిజర్వాయర్ వరకు లైనింగ్ దెబ్బతిన్నది. షట్టర్లు తుప్పు పట్టి నీళ్లు వృథాగా పోతున్నాయి. ఈ కాల్వపైనే రైతులు ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. కాల్వ మరమ్మతులను సుమారు 15 ఏండ్ల క్రితం చేపట్టారు. మళ్లీ ఇంతవరకు పట్టించుకోలేదు. అధికారులు స్పందించి కంపచెట్లు తొలిగించి, కాల్వ పూడికతీసి, లైనింగ్ ఏర్పాటు చేయాలి.

– దాసరి యాదగిరి, మల్లారం, కట్టంగూర్ మండలం

## 7న చేనేత ర్యాలీ

భువనగిరి కలెక్టరేట్, ఆగస్టు 4 : ఈ నెల 7న జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకొని ఉదయం 9:30 గంటలకు రాయగిరి క్రాస్ రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు చేనేత వాక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు కలెక్టర్ హనుమంతు కె. జెండగే ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం ఉదయం 10:30 గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశం మందిరంలో చేనేత కార్మికులకు సన్మానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, చేనేత సొసైటీల ప్రతినిధులు, అధికారులు పాల్గొంటారని తెలిపారు.

## సజావుగా టీటీసీసీ పరీక్ష

రామగిరి, ఆగస్టు 4: టెక్నికల్ టీచర్ సర్టిఫికెట్ కోర్సు(లోయర్) గ్రేడ్ థియరీ పరీక్ష నల్లగొండలో ఆదివారం సజావుగా ముగిసింది. పేపర్ –1 ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, పేపర్ –2 మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, పేపర్ –3 మధ్యాహ్నం 3:30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు జరిగాయి. పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 368మందికి 362 మంది హాజరైనట్లు నల్లగొండ డీఈఓ భిక్షపతి వెల్లడించారు.